అడవులను పరిరక్షించాలని వినతి

పుట్టపర్తి రూరల్ : అడవులు వేసవికాలంలో అగ్నికి ఆహుతి కాకుండా సంరక్షించాలని పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి విజయ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న లక్షల ఎకరాలలో అడవులు అగ్నికి ఆహుతి కాకుండా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనుల కింద అటవీ అధికారులతో మమేకమై చర్యలు తీసుకోవాలన్నారు.

పీడీకి వినతిపత్రం అందజేస్తున్న పర్యావరణవేత్త

రాయదుర్గంలో.. రాజకీయ కాక

- ఎమ్మెల్యే Vs ఛైర్‌పర్సన్
- మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో వాదోపవాదాలు
- విప్ కాపును ఎదిరించిన ఛైర్‌పర్సన్

రాయదుర్గం రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అధికార పార్టీలో పరిస్థితి రోజుకోమలుపు తిరుగుతోంది. అధిష్టానం సమన్వయ కర్తను మార్చిన తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇప్పటి వరకు కాపు రామచంద్రారెడ్డి వెంట నడిచిన వారే ఆయన్ను నిలదీసే పరిస్థితి వచ్చింది. తాజాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మధ్య మాటల యుద్ధం నడిచింది. ఒకరిపై ఒకరు వేలు చూపించుకుంటూ వాదోపవాదాలు చేసుకున్నారు. ఈ ఘటనతో మున్సిపల్ సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది.

ఒకరిపై ఒకరు వేలి చూపించుకుంటూ విమర్శలు చేసుకుంటున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పాలకమండలి సమావేశం బుధవారం ఉదయం అధ్యక్షురాలు పొరాలు శిల్ప అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యులుగా హాజరయ్యారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్ మధ్య విభేదాలు ఉన్నాయి. అయితే అవి ఎప్పుడూ బహిర్గతం కాలేదు. బుధవారం జరిగిన సమావేశంలో అవి బహిర్గతం అయ్యాయి. ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి మాట్లాడు తుండగా ఛైర్‌పర్సన్ శిల్ప అడ్డుతగిలారు. తాను మాట్లాడేప్పుడు అడ్డురావద్దని ఊరికే ఉండాలని ఎమ్మెల్యే ఆమె వైపు వేలెత్తి చూపించారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. గతంలో రామచంద్రారెడ్డి సిఫార్సు మేరకే శిల్ప ఛైర్‌పర్సన్ స్థానాన్ని చేపట్టారు. తరువాత మున్సిపాల్టీలో ఆమె మాట చెల్లుబాటు కాకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనైంది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ మధ్య రెండు వర్గాలుగా విడిపోయారు. ప్రతి పనికీ ఒక వర్గం మరో వర్గం అడ్డుకోవడం పరిపాటిగా మారింది. దీంతో మున్సిపాల్టీలో అభివద్ధి కుంటుబడుతూ వచ్చింది. ఈ క్రమంలో రాయదుర్గం వైసిపి సమన్వయకర్త మార్పు అంశం విభేదాలను మరింత తారాస్థాయికి చేర్చింది. ఏకంగా ఛైర్‌పర్సన్ ఎమ్మెల్యేను నిలదీసి ప్రశ్నించారు. జీరో అవర్‌లో సభ్యులు తాగునీటి ఎద్దడి, జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున మార్కింగ్ అయ్యాక శ్మశానవాటిక ప్రహరీ పనులు చేపట్టాలని కోరారు. అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకోవాలని, అందాక రిజిస్ట్రేషన్లు ఆపాలని ఎమ్మెల్యే కోరారు. పాలక మండలిలో రెండు వర్గాలు ఉన్నాయని, అలాంటప్పుడు ఎలా కలిసి పనులు చేస్తారని కొందరు సభ్యులు ఆరోపించారు. ఇందుకు ఛైర్‌పర్సన్ సమాధానం ఇస్తూ తాము ఎలాంటి వర్గాలు ఏర్పాటు చేయలేదని, చేసే పనులను కొందరు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నట్లు ఆరోపించారు. ఇలా సమావేశం జరుగుతున్నంత సేపూ ఒకరిపై ఒకరు వాదనలు చేసుకున్నారు.

సొంత నిధులతో అభివృద్ధి చేశా : కాపు

కోట్ల రూపాయల సొంత నిధులతో రాయదుర్గం పట్టణాన్ని అభివృద్ధి చేశానని, ఎన్నికల తర్వాత కూడా పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి సిఎం జగన్ జేబు నుంచి నిధులు ఇవ్వడం లేదని, అవి రాష్ట్ర ప్రభుత్వ నిధులే అన్నారు. నియోజకవర్గంలో తాను చేస్తున్న సేవలను ఓర్వలేని కొందరు తనకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేశారన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు తనను ఎప్పుడైనా కలవొచ్చన్నారు. అనివార్య పరిస్థితుల వల్ల తాను వైసిపికి దూరం కావాల్సి వచ్చిందన్నారు.

కాపుపై వైసిపి నేతల ఫైర్

రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై వైసిపి నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం రాయదుర్గంలోని వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పైల నరసింహయ్య, నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వీరాంజనేయులు మాట్లాడారు. కాపు రామచంద్రారెడ్డి బుధవారం నాడు రాయదుర్గం మున్సిపల్ కార్యాలయంలో వ్యవహరించిన తీరు సరికాదన్నారు. కాపు నెలరోజుల క్రితం జగన్‌మోహన్‌రెడ్డిని దేవుడు అంటూ పొగిడి ఇప్పుడు ఆయన్ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఆయనకు టికెట్ రాకపోయే సరికి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపు రామచంద్రారెడ్డికి రాజకీయ గుర్తింపును ఇచ్చింది వైఎస్ఆర్ కుటుంబం అన్న విషయాన్ని ఆయన గుర్తించుకోవాలన్నారు. కాపు తాటాకుచప్పళ్లకు భయపడేవారు వైసిపిలో ఎవరూ లేదన్నారు. విలేకరుల సమావేశంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్ర రెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ శివప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలి భాషా పాల్గొన్నారు.

వసూలు చేసి.. జమచేయడం మానేసి..!

- విత్తన, ఎరువుల సంస్థలకు చెల్లించని ఉద్యోగులు
- రూ.20లక్షల వరకు బకాయిలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించిన ఎరువులు, సబ్సిడీ విత్తనాలకు సంబంధించి డబ్బులను రైతుల నుంచి వసూలు చేశారు... ఆ డబ్బులను ఆయా సంస్థలకు చెల్లించే విషయంలో మాత్రం ఉద్యోగులు కాలయాపన చేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా చెల్లింపులు చేయని వారు అధికంగానే ఉన్నారు. చిన్న మొత్తాలుగానే కనిపిస్తున్నా ఈ ఘటన చిరుద్యోగుల పనితీరు ఏ విధంగా ఉందని చెప్పేందుకు నిదర్శనంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతు భరోసా కేంద్రాల నుంచి ఎరువులు, విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు ముందుగా డబ్బులు చెల్లించి తమకు అవసరమైనవి తీసుకుంటారు. వసూలు చేసిన ఈ డబ్బులను ఆయా సంస్థలకు వసూలు చేసిన విహెచ్ఎ (విలేజ్ అనిమల్ హాస్బండరీ అసిస్టెంట్లు) విఎస్ఎ(విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లు) మరికొందరరు వారి వద్దనే ఉంచుకున్నారు. ఈ రకంగా చూస్తే 2023 సీజన్‌లో 29 రైతుభరోసా కేంద్రాల్లో కలిపి రూ.3.37 లక్షలు బకాయిలున్నాయి. ఇందులో రొళ్ల మండలంలోని గుడిగురికి రైతు భరోసా కేంద్రంలోనే రూ.1.16 లక్షల బకాయి ఉంది. తనకల్లు సదుంలో రూ.35 వేలు, కదిరి మండలం ఎగువపల్లిలో రూ.26 వేలు, నల్లచెరువు-2లో రూ.23 వేలు ఇలా బకాయిలు పెద్ద మొత్తంలోనే ఉన్నాయి. మడకశిర మండలం మన్నూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం నుంచి కూడా రూ.1.18 లక్షలు బకాయి ఉంది. విహెచ్ఎల నుంచి రూ.1.40 లక్షలు బకాయిలున్నాయి. రబీకి సంబంధించి మూడు రైతు భరోసా కేంద్రాల నుంచి రూ.94 వేలు బకాయిలున్నాయి. ఇవి కాకుండా ఇంకా 2022-23, 2023-24 కలిపి మొత్తం రూ.20 లక్షల వరకు విత్తనాలకు సంబంధించి బకాయిలు ఉన్నాయి. ఎరువులకు సంబంధించి కూడా పెద్దఎత్తునే బకాయిలున్నట్టు సమాచారం. అనంతపురం జిల్లా బుక్కరాసయముద్రం మండల పరిధిలో పెద్ద మొత్తంలో డబ్బులను కాజేసి అడ్రసు లేకుండాపోయి ఉన్నాయి.

చెల్లించమని తాఖీదులిస్తున్నా..

వసూలు చేసి జమ చేయకుండా ఉన్న డబ్బులు సంస్థకు జమ చేయాలని అటు ఎపి సీడ్స్, ఇటు మార్కెటింగ్ శాఖ నుంచి ఆయా చిరుద్యోగులకు తాఖీదులిస్తున్నా పట్టించుకోనట్టు తెలుస్తోంది. చిన్న మొత్తాలే అన్న నిర్లక్ష్యం ఒకవైపు ఉండగా ఏమవుతుందన్న ధీమాతోనే డబ్బులు జమ చేయడం లేదని తెలుస్తోంది.

వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నాం..

ఇప్పటి వరకు మొత్తం రూ.20 లక్షల వరకు బకాయిలున్నాయి. వాటిని చెల్లించాలని రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రయత్నం చేస్తున్నాం. ఈ రెండు రోజుల్లోనే రూ.2 లక్షల వరకు వసూలు అయ్యాయి. తక్కినవి కూడా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

సుబ్బయ్య, ఎపి సీడ్స్, జిల్లా మేనేజరు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. బుధవారం నాడు పట్టణంలోని పలు కార్యాలయాలను తనిఖీ చేశారు. ముందుగా పట్టణంలోని మార్కెట్‌యార్డు గోడౌన్లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదాన్ని పరిశీలించారు. నియోజకవర్గానికి ఎన్నికల సమయంలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసేందుకు క్రీడా మైదానం సరిపోతుందా? లేదా? అన్న వాటిని నేరుగా పరిశీలించి, అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి కాయగూరల మార్కెట్ వద్ద ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ప్రభుత్వం ద్వారా పట్టాల పొందిన లబ్ధిదారులకు సచివాలయ వ్యవస్థ ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే పద్ధతులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వ ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేసే పనిని వేగవంతంగా పూర్తి చేయాలని సబ్ రిజిస్ట్రార్ రమణారావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ రెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఈశ్వరయ్య, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, డీఈవో మీనాక్షిదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలి : యుటిఎఫ్

రిలే దీక్షలో మాట్లాడుతున్న ఈఎస్ . వెంకటేష్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బాకీ పడ్డ ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు బుధవారం నిర్వహించారు. ఈ రిలే దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా నాయకులు ఇఎస్ వెంకటేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనతో పాటు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుశెట్టిపి జయ చంద్రా రెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న వేల కోట్ల రూపాయలు బాకీ పడిందని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో మూడు నెలల నుంచి దశల వారీ పోరాటాలు చేస్తున్నామన్నారు. మూడవ దశ పోరాటం లో భాగంగా ఆర్డీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఫిబ్రవరి 1న మడకశిర, 2న హిందూపురం, 3న కదిరి డివిజన్లలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సునీల్, నారాయణస్వామి, ఆంజనేయులు, మురళి, నగేష్, చాంద్ బాష, క్రిష్టప్ప, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ పనులు వేగవంతం : జేసీ

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, కదిరి ఆర్డీవో వంశీకృష్ణతో పాటు సంబంధిత తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ముదిగుబ్బ నుండి పుట్టపర్తికి 32 కిలోమీటర్ల దూరానికి 54. 77 హెక్టార్ల భూమికి, ప్యాకేజీ రెండుకు సంబంధించి 32 కిలోమీటర్ల నుండి 79 కిలోమీటర్ల వరకు 6.46 హెక్టార్లకు సంబంధించిన భూమికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇంతవరకు బ్యాంకు వివరాలు ఇవ్వనందున భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వడంలో ఆలస్యమవుతుందన్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బి. కొత్తకోట నుండి గోరంట్ల అక్కడి నుంచి హిందూపూర్ ఎన్ హెచ్ 544 బెంగళూరు, కడప విజయవాడ ఎన్ హెచ్ 342 ముదిగుబ్బ, పుట్టపర్తి నుంచి కోడూరు ఎన్‌హెచ్ 42 బత్తలపల్లి, ముదిగుబ్బ ఎన్‌హెచ్ 42 కదిరికి సంబంధించి ఇప్పటివరకు జరిగిన భూ సేకరణ వివరాలు పెండింగ్ పనులపై జాయింట్ కలెక్టర్ ఆరా తీశారు. ముఖ్యంగా భూసేకరణ పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అలాగే నష్టపరిహారం అందించడంలో ఎలాంటి జాప్యం చేయరాదని సూచించారు. భూసేకరణలో భాగంగా మంజూరైన నష్టపరిహారం అందించడంలో ఏమైనా కుటుంబ, కోర్టు కేసులు పెండింగ్ ఉన్నట్లయితే వాటన్నిటికీ డబ్బు కోర్టులో డిపాజిట్ చేయడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, గోరంట్ల, చిలమత్తూరు, ముదిగుబ్బ, ధర్మవరానికి చెందిన తహశీల్దార్లు, నేషనల్ హైవే డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి మడకశిర రూరల్

వైసిపి ప్రభుత్వం రైతుసంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. బుధవారం స్థానిక ఎపిడి కార్యాలయంలో జలకళ పథకంపై సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జలకళ పథకంపై 150 మంది రైతులకు పైసా ఖర్చు లేకుండా బోర్లు వేయించామని తెలిపారు. ఇప్పటివరకు 30 మంది రైతులు విద్యుత్ సర్వీసు పొందారని మిగిలిన వారు కూడా వెంటనే విద్యుత్ సర్వీసు పొందాలని అన్నారు. విద్యుత్ సర్వీసు పొందిన 19మంది రైతులకు మోటారు, స్టాటరు, కేబుల్ తదితర విద్యుత్ సామాగ్రిని ఎమ్మెల్యే ఈసందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మడకశిర కన్వీనర్ రామిరెడ్డి, గుడిబండ ఎంపీపీ రాధమ్మ, అమరాపురం సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, ఎపిడి లక్ష్మీనారాయణ, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సొంత గూటికి మాజీ వైస్ ఎంపీపీ

బత్తలపల్లి : బత్తలపల్లి మాజీ వైస్ ఎంపీపీ గొల్లపల్లి వెంకటేశ్వర్ రెడ్డి వైసీపీ కండువా కప్పుకొని తిరిగి సొంతగూటికి చేరారు. బుధవారం ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి స్వగృహంలో మండల వైసీపీ నాయకుల సమక్షంలో మండలంలోని నల్లబోయినపల్లి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని తిరిగి వైసిపి గూటికి చేరారు. వైసిపి నుండి ఎంపీటీసీగా గెలుపొంది వైస్ ఎంపీపీగా పదవి అనుభవించిన అనంతర జరిగిన పరిణామాల వల్ల వెంకటేశ్వరరెడ్డి టిడిపిలో చేరారు. అయితే రెండు రోజులుగా వెంకటేశ్వరరెడ్డితో బత్తలపల్లి వైసీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి,సచివాలయ కన్వీనర్ రాంభూపాల్ రెడ్డి,బండి వీరనారప్ప, యర్రాయపల్లి కమతం ఈశ్వరయ్య తదితరులు చర్చించి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో ఆయన బుధవారం పార్టీలో చేరారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటికి గొల్లపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,రాజారెడ్డి,ఓబిరెడ్డి,మహేష్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలసి ఎమ్మెల్యే వెంకటేశ్వరెడ్డికి వైసీపీ కండువా వేశారు.

నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు

బుక్కపట్నం : ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకే రిజిస్ట్రేషన్లు జరుగుతాయని నూతన సబ్ రిజిస్టర్ రామ్మోహన్ చౌదరి తెలిపారు. ఈ మేరకు ఆయన బుక్కపట్నం నూతన సబ్ రిజిస్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న గౌరమ్మ కదిరి కార్యాలయానికి వెళ్ళగా, ఆమె స్థానంలో కడపలో పనిచేస్తున్న రామ్మోహన్ చౌదరి పర్మినెంట్ సబ్ రిజిస్టర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

ప్రజాశక్తి-హిందూపురం

ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహిస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్ కోర్టు పర్యవేక్షణ అధికారిణి వెంకటరత్నమ్మ స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతు ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని అన్నారు. అయితే ఉద్యోగంలో ఉన్నంతకాలం ఎంత అంకితభావంతో పనిచేస్తే అంతే గుర్తింపు వస్తుందన్నారు. అదే తరహాలోనే సబ్ కోర్టు పర్యవేక్షణ అధికారిణి వెంకటరత్నమ్మ ఎంతో అంకితభావంతో విధులు నిర్వహించి, అందరి మన్ననలు పొందారని ప్రశంసించారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, వివిధ కోర్టుల పర్యవేషణ అధికారులు ఆసిఫ్, రాధాకృష్ణ, రామాంజనేయులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

వెంకటరత్నమ్మను సన్మానిస్తున్న న్యాయమూర్తులు, తదితరులు

రిలేదీక్షలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

సమస్యలు పరిష్కరించండి

ఓబుళదేవర చెరువు : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని భవన నిర్మాణరంగ కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి శ్రీ రాములు, అధ్యక్షులు కుల్లాయప్ప మాట్లాడుతూ సొంతిల్లు లేక భవన నిర్మాణ కార్మికులు అనేక సంవత్సరాలుగా అద్దె ఇళ్లలో ఉంటూ జీవనం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేద భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహ నిర్మాణాలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కిష్టప్ప, కార్యదర్శి రవి, ట్రెజరర్ సూరి, శ్రీనివాసులు, మహేంద్ర, సహాయ కార్యదర్శి కేశవ, రమణప్ప, మహిళ నాయకులు మణి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఇంటర్నెట్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని అందుకు అనుగుణంగా ఆపరేటర్లు ముందుకు సాగాలని ఏపీ ఫైబర్ మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో పట్టణ వ్యాప్తంగా ఉన్న ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్, మార్కెటింగ్ మేనేజర్ ధనుంజయ్ మాట్లాడుతు ఈపీ ఫైబర్ నెట్ ద్వారా వినియోగదారులకు కేవలం రూ.190లకే ఇంటర్నెట్ ప్యాకేజీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇంత తక్కువ ధరలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని వినియోగదారులకు ఇతర ఏ సంస్థలు అందించలేవని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాల్సిన బాధ్యత ఆపరేటర్ల పై ఉందన్నారు. ఏపీ ఫైబర్ పై ప్రజలకు చైతన్య పరిచి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఆపరేటర్లు మహేష్, శివ, శివ శంకర్, వెంకటేష్, ప్రశాంత్, అశోక్ తో పాటు పరిగి, లేపాక్షి, సోమందేపల్లి, రొద్దం తదితర మండలాలకు చెందిన ఆపరేటర్లు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

మడకశిర : మడకశిర నియోజకవర్గం కో ఆర్డినేటర్ పరిశీలకులు, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, నియోజకవర్గం అబ్జర్వర్ పోకుల అశోక్ కుమార్ ఫిబ్రవరి 2న నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గం సమన్వయ కర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి హెచ్ బీ నరసేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వై టీ ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు వారు మంత్రి సమావేశస్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జిబి శివకుమార్, న్యాయవాది గోవర్ధన్ రెడ్డి, రవి శేఖర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, సర్పంచి కరుణాకర్ గౌడ్, సర్పంచి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

4న లేపాక్షికి బాలయ్య

లేపాక్షి : మండలకేంద్రమైన లేపాక్షికి ఫిబ్రవరి 3న స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సతీసమేతంగా రానున్నారని టిడిపి స్థానిక నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు లేపాక్షిలో ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన దుర్గ వీరభద్ర పాపానేశ్వర నంది ఆలయం పరిసరాలలో ఆదివారం సాయంత్రం హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ ఆధ్వర్యంలో కావూరి వారి ఆయాన్ డాన్స్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ కుటుంబ సమేతంగా హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప, నాయకులు రమేష్ రవి, చంద్ర, సదాశివా రెడ్డి, షీక్షావలి, గంగిరెడ్డి, మారేష్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలు ప్రారంభం

కొత్తచెరువు: ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకలు బుధవారం నుండి యథావిధిగా ప్రారంభమయ్యాయి. రైల్వే స్వరంగ మార్గంలో పైన మరమ్మతు ల పనులు డిసెంబర్ 8వ తేదీ నుండి ప్రారంభించినందున రైళ్ల రాకపోకలు రద్దయ్యాయి ఈ పనులు రైల్వే కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయడంతో రైల్వే ఇంజనీర్ల ఆదేశాల మేరకు ఈ రాకపోకలు ప్రారంభించారు.

'పది' విద్యార్థులకు శిక్షణ తరగతులు

ఓబులదేవర చెరువు : కదిరి డివిజన్ పరిధి లో గల సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల్లో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులను స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిఎస్‌సిడబ్ల్యూఓ శివ రంగ ప్రసాద్, రెడ్డి బాలాజీ, వార్డెన్ రవీంద్ర నాథ్ రెడ్డి, రెయిన్బో స్కూల్ కరస్పాండెంట్ జయసింహ రెడ్డి, గౌరీశంకర్ రెడ్డి, జయశంకర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

రొద్దం : బాలల కోసం భారత రాజ్యాంగం అనే పుస్తకాలను జిల్లా ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎఎస్. మూర్తి బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. మూర్తి తన సొంత డబ్బులు ఖర్చు చేసి కొనుగోలు చేసిన పుస్తకాలను ఎంపీపీ చంద్ర శేఖర్, తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్ చేతుల మీదుగా స్థానిక కెజిబివిలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరత్నమ్మ, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

రొద్దం: రొద్దం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఎంపిపి చంద్ర శేఖర్ మూర్తి ఆధ్వర్యంలో తహశీల్దార్ అనంతచారి సమక్షంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పౌరహక్కుల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఎంపీపీ చంద్రశేఖర్, మూర్తి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, జమేదార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

మడకశిర : మండల పరిధిలోని గుండుమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు గిరిజమ్మ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈసందర్భంగా ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప, ఎంపీటీసీ పాండురంగప్ప, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని రెక్కమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సివి ప్రమద రాణి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆమెను బుధవారం సన్మానించారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ హెచ్‌ఎం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణ నాయక్, కదిరి ఎంఇఒ చిన్నకృష్ణ, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్, హరి కిషోర్, రవీంద్రారెడ్డి, జయరాములు, గంగాధర్, చిన్నప్పయ్య, రాజగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా అంజయ్య

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా ఎం. అంజయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఆయన ఒంగోలు అభివృద్ధి సంస్థ లో పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి అభివృద్ధికి అందరి సహకారంలో చర్యలు తీసుకుంటానని అన్నారు. మున్సిపల్ కమిషనర్‌ను చైర్మన్ తుంగ ఓబులపతితో పాటు పలువురు కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

జేసీని కలిసిన సిఇఒ

పుట్టపర్తి అర్బన్:- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ను ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈవో నిదియాదేవి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు, లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం సిఇఒ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నిలబెట్టడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.



జేసీకి మొక్క అందజేస్తున్న జెడ్పీ సిఇఒ

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి కదిరి అర్బన్

మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్దారెడ్డి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసా అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సమావేశంలో కదిరి మున్సిపాలిటీలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లేఅవుట్లలో కేటాయించిన పట్టాలను సత్వరమే లబ్ధిదారులకు అందచేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ శ్రీహరి బాబు వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

పంచాయతీ స్థలంలో ఫెన్సింగ్ వేసిన దృశ్యం

పంచాయతీ స్థలాల ఆక్రమణ

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారుల్లో స్పందన కరువైంది. మండల కేంద్రంలోని బుక్కపట్నం కొత్తచెరువు ప్రధాన రహదారిలో దేవుని పేరిట ఉన్న భూములను కొందరు వ్యక్తులు తమకే చెందుతుందని చెబుతూ దాదాపు 15 సెంట్లు పంచాయతీ భూమి చుట్టూ ఇనుప కంచె వేశారు. ఈ విషయంపై అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ, దేవుని భూములు ఆక్రమణకు గురి కాకుండా కాపాడాల్సిన అధికారులు ఆ విధంగా చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత భూముల విలువలు పెరగడంతో ప్రభుత్వ, దేవదాయ శాఖ భూములు అక్రమాలకు గురి అవుతున్నాయని వాటిని కాపాడాల్సిన అధికారులు ఇప్పటికైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలి : కలెక్టర్

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

క్రీడాకారులు ఏ క్రీడలోనైనా గెలుపోటములను సమానంగా స్వీకరించి ఆటలో రాణించాలని, క్రీడాస్ఫూరితో మెలగాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఆడదాం ఆంధ్ర క్రీడోత్సవాల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రథమ బహుమతులు తీసుకొని రావాలని పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ సమీపంలో వై జంక్షన్ ఎదురుగా ఉన్న క్రీడా మైదానంలోజిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వ్యవసాయ సలహా మండల చైర్మన్ ఎవి. రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, హుడా చైర్మన్ లక్ష్మీ నరసమ్మ, ఆర్డీవో భాగ్యరేఖ, క్రీడా అధికారి ఉదయ భాస్కర్, నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను గ్రామ సచివాలయ, మండల, స్థాయిలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. బుధవారం నియోజకవర్గ, జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. శారీరక, మానసిక ధృఢత్వం పెంపొందించే ఉద్దేశంతో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి 'ఆడదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలలో క్రీడ ప్రతిభను ప్రదర్శించి భవిష్యత్తు రోజులలో జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఆరు నియోజకవర్గంలో సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ , సంయుక్త కలెక్టర్ వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలోమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కోచ్‌లు, పీడీలు, పిఇటిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు తగదు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై రాజమండ్రి వైసిపి ఎంపీ భరత్ వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని జనసేన మండల ప్రధాన కార్యదర్శి కొండ బయన్న, సతీష్ అన్నారు. ఈ మేరకు వారు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైసిపి విఫలం అయిందన్నారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ఈ సందర్భంగా సవాల్ చేశారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, సద్దాంహుసేన్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

జగన్‌ను ఓడించేందుకు జనం సిద్ధం : సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

జగన్ రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారనిటీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ జగన్ రెడ్డికి కౌంట్ డౌన్ మొదలైందన్నారు. వైసిపి దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల సమయంలో జగన్ రెడ్డి 'సిద్ధం'తో బహిరంగ సభలు నిర్వహించి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని జగన్ రెడ్డి, వైసిపి నాయకులు చెబుతుంటే, మరోవైపు ప్రజలు కూడా వారిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని సవితమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - గాండ్లపెంట

రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కదిరి మోటర్ వాహన తనిఖీ అధికారి వరప్రసాద్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హీరోహోండా షోరూం యజమాని కిషోర్, హెచ్‌ఎం శారదాంబ,ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్, జయరాములు, రాజగోపాల్, గంగాధర్, చిన్నప్పయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి : జేసీ

ప్రజాశక్తి- హిందూపురం

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సెక్టారల్ అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి అభిషేక్ కుమార్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సెక్టార్ అధికారులతో వారి పరిధిలో ఉన్న పోలింగ్ బూత్ లలోని సౌకర్యాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతు సెక్టార్ అధికారులందరు వారి పరిధిలో ఉన్న పోలింగ్ బూత్ లను పరిశీలన చేసి, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు అన్నిటిని ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ ఇన్‌ఛార్జి కమిషనర్ సునీల్, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు తహశీల్దార్లు స్వర్ణలత, బాబు, నాగరాజు, ఎంపీడీఓ నరేంద్ర కుమార్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి నియోజకవర్గం ఓటరు తుది జాబితాను ఆర్డీవో భాగ్యరేఖ బుధవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, వాటిని విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎిఒ జిలాని, నరసింహులు, ఇడిటి మనోజ్ కుమార్ రెడ్డి, డీటీ హరికృష్ణ, రెహమాన్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఓబుళదేవరచెరువు : మండలంలోని చింతమాను పల్లి పంచాయతీ నాయనవారి పల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ, మాజీ కదిరి మార్కెట్ చైర్మన్ బోయపాటి రామప్ప నాయుడు (85) మంగళవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రామప్ప నాయుడు పార్టీకి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2న మంత్రి పెద్దిరెడ్డి రాక

అమరాపురం : మడకశిర నియోకవర్గంలో ఫిబ్రవరి 2న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వీరలక్కప్ప కోరారు. స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా నందు వైసిపి నాయకులు వాగేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ నాయకులు వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప, జిబి శివకుమార్,మాజీ మంత్రి నరసే గౌడ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటవ తారీఖున నియోజకవర్గ అబ్జర్వర్ పోకుల అశోక్ కుమార్ తదితరులు మంత్రి పెద్ద రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలించడానికి వస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి 2న స్థానిక వీరశైవ కళ్యాణమండపంలో సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిశంకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, వీరకేతరాయప్ప, ఎంపీటీసీ హనుమంతరాయప్ప, జయప్రకాష్ ,సతీష్, నారాయణగౌడ పాల్గొన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పేదల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాల ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పెనుగొండ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని కమ్మవారి పల్లి పంచాయతీలోనిఎర్రయ్య గారి పల్లి, కమ్మవారి పల్లి, చుండూరు వాండ్లపల్లి, ఎముకల గుట్లపల్లి గ్రామాల్లో మంగళవారం ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. అలాగే కమ్మవారిపల్లిలో నూతనంగా నిర్మించిన డాక్టర్. వైఎస్ఆర్ ఆరోగ్యకేంద్రాన్ని ఎమ్మెల్సీ వాల్మీకి మంగమ్మ, సర్పంచి మణి వెంకట శివారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం హెల్త్ హబ్ గా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, ఉప సర్పంచి రాజా, కొత్త వెంకట రంగారెడ్డి, వీర నారాయణ రెడ్డి, అంగడి నారాయణరెడ్డి, రామిరెడ్డి, గుణశేఖర్ రెడ్డి, రాజారెడ్డి, పాటూరి శంకర్ రెడ్డి, విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిపిఆర్ఒకు సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న జిల్లా పౌర సంబంధాల అధికారి వేలాయుధాన్ని బుధవారం సన్మానించారు.కదిరి నియోజక వర్గానికి సంబంధించిన చిన్న పత్రికల మీడియా ప్రతినిధులతో పాటు వివిధ కళాకారులు పౌర సంబంధాల అధికారి వేలాయుధాన్ని శాలువా, పూలమాలతో సత్కరించారు.

డిపిఆర్ఒను సన్మానిస్తున్న దృశ్యం

మహిళపై దాడి.. ఆభరణాలు చోరీ

లేపాక్షి : మండలం పరిధిలోని వడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళపై గుర్తుతెలియని దుండగులు దాడికి పాల్పడి ఆమె ధరించిన ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన గంగరాజమ్మ అనే మహిళ బుధవారం గ్రామ పొలాల్లో పశువులు మేపుతుండగా తెల్లని స్కూటీ పైన వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెపై దాడి చేశారు. ఆమయె చెవుల్లో ఉన్న కమ్మలు, తాళిబొట్టు బిళ్లలు చోరీ చేశారు. ఈసందర్భంగా దుండగులు చేసిన దాడిలో గంగరాజమ్మ గాయాల పాలయ్యారు. దీంతో స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసు కొన్న పోలీసులు సంఘటనాస్థలాన్ని సందర్శించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఐశ్వర్యం కన్నా ఆరోగ్యం మిన్న

హిందూపురం : ఐశ్వర్యం కన్నా ఆరోగ్యం మిన్న అని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. బుధవారం పట్టణంలో 14వ వార్డుకు సంబందించి ఇందిరా నగర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మేన్ బలరామిరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ కిరణ్మయి, మున్సిపల్ సిబ్బంది, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, గృహ సారథులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్ఐకు సన్మానం

బుక్కపట్నం : బుక్కపట్నం ఎస్ఐ నరసింహుడు పట్నం స్టేషన్‌ను బదిలీ అయిన నేపథ్యంలో ఆయనను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసిన నరసింహుడు సేవలను కొనియాడారు. అనంతరం టిడిపి నాయకులు ఎస్ఐను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు బాలు, జయరాం, శ్రీరాములు, అబ్దుల్ వాజిద్, కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు..

'శ్రీనిధి' నిధులు స్వాహా ... పోలీసులకు ఫిర్యాదు

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీలోని గొల్లపల్లి మహిళా సంఘాలకు చెందిన శ్రీనిధి డబ్బులు 12 లక్షల రూపాయలు బుక్ కీపర్ రామాంజనేయులు స్వాహా చేసినట్లు మహిళాసంఘాల సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా మహిళా సంఘాల లీడర్లు మాట్లాడుతూ దాదాపు 14 సంఘాల పొదుపు డబ్బులు 12 లక్షల రూపాయలు స్వాహా చేసి దాదాపు 100 మంది మహిళలను బుక్‌కీపర్ మోసం చేశాడని ఆరోపించారు. ఐకెపి కార్యాలయం నుంచి మహిళా సంఘాలకు నోటీసులు రావడంతో బుక్ కీపర్ వ్యవహారం బయటపడిందన్నారు. ఇదేమని అడిగితే బుక్‌కీపర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్త చేశారు. ఈమకు న్యాయం చేయాలని వారు పోలీసులను కోరారు.

బదిలీ అధికారికి సన్మానం

పరిగి : మండలంలో ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై వెళుతున్న సరస్వతిని స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది బుధవారం సన్మానించారు. పరిగి నుండి కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఆమెను సన్మానించిన నాయకులు, అధికారులు మాట్లాడుతూ ఎంపిడిఒగా సరస్వతి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఏవో అశ్వర్థప్ప, ఎంఇఒ శేషాచలం, ప్రజాప్రతినిధులు ప్రభాకర్, బాలాజీ శివశంకర్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై దాడి సిగ్గుచేటు

కదిరి టౌన్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కారుపై పశ్చిమబెంగాల్‌లో మాల్దారు దుండగులు దాడిని కాంగ్రెస్‌పార్టీ స్థానిక నాయకులు ఖండించారు. ఈదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు.ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బొగ్గిటి మునికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల ఓర్వలేని ఓర్వలేని వారు ఇలాంటి దుశ్చర్యలకు ఒడిగడుతున్నారన్నారు.

మాతా శిశు మరణాలపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ : మాతా శిశు మరణాల పట్ల ఆరోగ్య వైద్యశాఖ, అంగన్వాడీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో మాతా శిశుమరణాలకు సంబంధించిన జిల్లా సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. తల్లి బిడ్డను కాపాడటానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల జిల్లా అధికారి డాక్టర్ కృష్ణయ్య, డిప్యూటీ డిఎంహెచ్ఒ సాల్వియ సోలొమాన్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ ఏర్పాటు

ధర్మవరం టౌన్ : ధర్మవరం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నూతనప్రచార కమిటిని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ మంగళవారం ప్రకటించారు. అదేవిధంగా త్రిసభ్యకమిటితోపాటు సోషియల్ మీడియా కమిటిని కూడా ఏర్పాటుచేసి కార్యకర్తల్లో నూతనోత్సహానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రచార కమిటిలో స్థానం పొందిన టీడీపీ నాయకులు భీమనేని ప్రసాదనాయుడు, కార్యకర్తలు గుంపులక్ష్మీపతి, భీమనేని ఉమామహేశ్వచౌదరిలు కాణిపాకం వినాయకుడిని దర్శించుకున్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

హిందూపురం : పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆద్వర్యంలో కొత్తకాపులపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతు గ్రామంలో 7 రోజుల పాటు తమ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్య, ఆరోగ్యం, పచ్చదనం, పరిశుభ్రత, ఓటు హక్కు లాంటి విషయాలపై గ్రామస్తులకు అవగాహన కలిగించారన్నారు. ఈసందర్భంగా ప్రోగ్రాం అధికారి హరీష్ వారం రోజుల పాటు జరిగిన కార్యక్రమాల నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శివరామిరెడ్డి, అశ్వర్థ నారాయణ, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రత్యేక శిబిరం కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టీ.బషీర్ అహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోదమ్మ, రాధిక, జూనియర్ కళాశాల గ్రంథాలయ అధ్యాపకులు రామచంద్రయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ శంకర్ నాయక్, హఫీజ్, పాల్గొని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

గోరంట్ల : పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన ఎన్ఎస్ఎస్ క్యాంప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా యూనిట్ విద్యార్థులు గుమ్మయగారిపల్లి, రాజీవ్ కాలనీలో అక్షరాస్యతపై అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు రఘునాథ్ రెడ్డి, ఆజాద్, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపకులు నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హిందూపురం : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని హిందూపురం పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జులు శాంతమ్మ, దీపిక పేర్కొన్నారు. బుధవారం పురపాలక సంఘంలోని 12వ వార్డు పరిధిలోని మోడల్ కాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

హిందూపురం : చిన్నతనం నుండి చక్కగా చదువుకోవడం వల్ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని మాజీ ప్రభుత్వ న్యాయవాది సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని డిబి కాలనీ లో ఉన్న బాలసదన్ లో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వల్ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంతోషి కుమారి, ఈశ్వరప్ప, లిజనింగ్ అధికారి శ్రీనివాసులు, బాలసదన్ పర్యవేక్షణ అధికారిని రహమత్, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రొద్దం క్రీడాకారులు

రొద్దం : పుట్టపర్తిలో బుధవారం జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలోని నియోజకవర్గ పోటీలలో గెలుపొందిన వారికీ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ఖోఖో విభాగంలో రొద్దం మండలంలోని కలిపి సచివాలయ బాలుర జట్టు విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు పంచాయితీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను పంచాయతీ అధికారులు, నాయకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రొద్దం ఖోఖో జట్టు